**"కోటలున్నా పేటలున్నా, కోసకు పొట్టే కొలత గువ్వా! వలనివానిని వదలివేసిన పరమసివుడే నీవు గువ్వా! అని హాయిగా చెట్టుకింద వండుకు తింటూ నిద్రపోతూ, పాటలు పాడుకునే ముష్టివాడి మీద ఆ వ్యాపారవేత్తకు కోపం ఎందుకొచ్చింది?**



# పాడు మరిచిన గువ్వ

## అమధానుల విజయలక్ష్మి

పావం బీదవాడు!

నాకు వాడిని చూసినవ్పుడల్లా బోలెడు జాలేస్తూ ఉంటుంది.

నాకైతే ఇంతపెద్ద మేడుంది. ఇంటినిండా ఇరవై మంది నౌకర్లున్నారు. మేడనిండా ఏర్‌కూలర్లున్నాయి. నేలనిండా కుషన్ కుర్చీలున్నాయి. నెలకు పదిలక్షలు మిగిల్చే బోలెడు వ్యాపారాలున్నాయి. ఆ వ్యాపారాల్లో తిరగడానికి నాలుగు కార్లున్నాయి. కార్లలో తిరగడానికి బోలెడు బంధుబలగముంది.

పావం వాడికో?

ఓ గోచిగుడ్డా.. డొక్కుపోయిన సత్తుగిన్నె... లొత్తలుపడిన జర్మన్ సిల్వరుగ్లానూ తప్ప మరేంలేవు.

అందుకే రోజూ పొద్దున్న వాడికో ఇరవై పైసలు దానం చేసేస్తూ ఉంటాను. మేడమించి నేను ఇరవై పైసలు విసిరేస్తాను. అది గేటుకవతల పడుతుంది. వాడు ఆ బిళ్ల గురించి మట్టిలో కాస్సేపు వెతుక్కుంటాడు. బిళ్ల దొరగ్గానే ఏదో పాడుకొంటూ చెట్టుకిందకెళ్లిపోతాడు.

నెలరోజుల క్రితం గేటుకెదురుగా ఉన్న వేపచెట్టుకింద ప్రత్యక్షమయ్యాడు వాడు.

"మేడలోనో నీడలోనే ఏడనుంటే నేమి గువ్వా
పాడుమనసును వట్టి ఉంచిన వరమసివుడే
నీవు గువ్వా!" అని పాడుకొంటూ-

వాచ్‌మన్ వాడిని గెంటేయబోయాడు. నేనే వద్దని వారించాను.

"గేటు బయటే ఉన్నాడుగా.: ఉండనీయ్।. గేటుదాటి లోపలికొస్తే అప్పుడు చూద్దాం " అన్నాను.

అప్పట్నించి వాడి జోలికిపోలేదు వాచ్‌మన్.

నేను పొద్దున్నే మేడమీద కిటికీ దగ్గర కూర్చుని కాఫీ తాగుతున్నప్పుడు మూడు రాళ్లపొయ్యిమీద బొచ్చెపెట్టి కాచుకొన్న ద్రవమేదో తాగుతూ కనిపిస్తాడు వాడు.



మధ్యాహ్నం భోజనమయ్యాక వక్కపలుకు నములుతూనేనా కిటికీ దగ్గరికొచ్చినప్పుడు మళ్లా ఆ చెట్టుకింద నీడలోనే ప్రత్యక్షమవుతాడు వాడు.

ఓ ఎండురొట్టెలో ఓ పచ్చి ఉల్లిపాయ నంచుకొని తింటూనో.. అడుక్కుతెచ్చుకొన్న రకరకాల అన్నాలు కలిపేసి నోట్లో అంతంత ముద్దలు కుక్కుకుంటూనో కనిపిస్తాడు.

రాత్రి నిద్రపోయేముందు కిటికీ తెర లాగుదామని కిటికీ దగ్గరికెళ్లినపుడు తలకింద చేతులు పెట్టుకొని ఆ మట్టిలోనే వెల్లికిలా పడుకొని నక్షత్రాల

ను చూస్తూ ఏదో పాడుకొంటూ కనిపిస్తాడు.

ఆ రోజు ఉదయాన్నే రోజులా కిటికీల్లోంచి గేటుబయట చెట్టుకింద ముష్టివాడిని చూస్తున్నాను.

"సార్ కాఫీ!" అంటూ ట్రాలీ తోసుకుంటూ వచ్చాడు రామన్న.

ఓ ప్లేట్లో దట్టంగా వెన్నపూసిన నాలుగు బ్రెడ్డు ముక్కలు. ఆ ప్రక్కనే బాగా ఉల్లిపాయలు వేసి నేతిలో బాగా వేయించిన రెండు ఆమ్లేట్లు, మరో ప్లేట్లో ఎర్రటి ఆపిల్ పండు ముక్కలు.

బ్రెడ్ అందుకొని కొరుకుతూ "కాఫీ" అన్నాను రామన్నతో.

ఖరీదైన చైనా క్లే కెటిల్‌లోంచి డికాక్షన్ ఓ పెద్ద కప్పులోకి వంపి, చిక్కటి మీగడపాలు వేసి నిమిషాల్లో నురగలు కక్కే కాఫీ తయారు చేసి ఇచ్చాడు రామన్న.

చెట్టుకింద ముష్టివాడు పొయ్యిమీంచి బొచ్చె దింపి గ్లాసులోకిఆవిర్లుకక్కుతున్న ద్రవమేదో దింపి, ఊదుకొని ఊదుకొని తాగుతున్నాడు.

"ఏమిటి వాడు తాగేది?" రామన్న నడిగాను.

"ఏ అంబలో అయ్యుంటుంది సార్. అన్నట్లు అంబలంటే మీకు తెల్వేదుగదా? ఇన్ని నీళ్లలో గుప్పెడు నూకలో, జొన్నలో ఏసుకు కాసుకొని తాగుతారు. అనుంటోళ్లు ఇంకే తాగ్గలరుసార్"

'పావం!" అన్నాను. ఎప్పట్లాగే నాకు వాడిమీద జాలి, పొంగిపొర్లుతూ వచ్చేసింది.

జేబులన్నీ తడిమి ఓ పావలా బిళ్లను తీసి వాడు నావైపు చూడగానే కిటిలోంచి విసేరేశాను. కాస్సేపు మట్టిలో ఆ బిళ్లను వెతుక్కొని దొరగ్గానే ఏదో పాడుకొంటూ చెట్టుకింద కెళ్లిపోయాడు వాడు.

అదిగో.. నాకు కాస్తో కూస్తో కోపమొచ్చేది అప్పుడే!

"బిళ్ల తీసుకోగానే "చల్లని, పెబువులు నల్ల గుండాల" అనొచ్చుగా?



## అంతరాయం

"నిన్న వార్తలు చదువుతూ 7.36 నుండి 7.37 వరకు అంతరాయం కలిగినందుకు చింతిస్తున్నాం" అని అన్నారు. అప్పుడు టీ.వీ. స్టుడియోలో కరెం టేమైనా పోయిందా? అడిగింది ప్రమోద.

"కరెంట్ పోలేదు. నా మీసం జారితే సవరించుకోటానికి అద్దం దగ్గరకు వెళ్ళానులే" అన్నాడు ప్రసాదు.

గీత [గుంటూరు]

పోనీ అంతంతమాటలు రాకపోతే "సలాం దొరా!" అని తలెత్తి అనొచ్చుగా? పోనీ అలాక్కూడా తలెత్తి ఓసారి కృతజ్ఞతగా చూడొచ్చుగా?

ఊహూ - అవేమీ చెయ్యడు - అసలు మేడమీద ఓ మనిషి ఉన్నాడన్న విషయమే తెలియనట్లు తాను పాడుకొంటూ వెళ్లిపోతాడు.

"పావం బీదవాడు" అని నేనూ అట్టే కోపం తెచ్చుకోకుండా ఊరుకొంటాను.

*** *** ***

ఆరోజు నేను డాక్టరు దగ్గరికెళ్లొచ్చాను.

ఈమధ్య తరచుగా తల తిరుగుతుంది - మాట్లాడితే కోపమూ, చిరాకూ ఎక్కువైపోతున్నాయ్. పైగా ఓసారి స్వల్పంగా గుండెపోటు కూడా వచ్చింది.

"హై బ్లడ్ ప్రెషర్" అన్నాడు డాక్టరు

"ఏం సార్ మీ బిజినెస్ వ్యవహారాల్లో రోజుకెన్ని గంటలు పనిచేస్తారు?" అడిగాడు.

"రమారమి రోజుకిరవై గంటలు!"

"చూడండి - మీకింత ఎక్కువగా రక్తపుపోటు ఉన్నప్పుడు బుర్రని అంతగా వేడెక్కించకూడదు. పైగా బిజినెస్సంటే బోలెడు టెన్షన్లుంటాయి. కొన్ని వ్యాపారాలు, పోనీ, ఎవరికైనా అప్పచెప్పేయకూడదూ?"

నాకు షాక్ కొట్టినట్లయింది. అమ్మో! వ్యాపారం ఇంకొరి కప్పచెప్పడమే? కొంపమునిగిపోదూ? అప్పుడెప్పుడో ఓసారి బొంబాయి వెళ్లి, అక్కడ తప్పనిసరిగా ఓ పదిరోజులుండిపోవలసొచ్చి హోటలు వ్యాపారం తోడల్లుడికి అప్పచెప్తే అంతా నానా గందరగోళం చేసేశాడు! ఇరవై వేల లాభం పోగొట్టేశాడు. అప్పట్నించి చచ్చినా ఎవరికీ వ్యాపారం అప్పచెప్పదలచుకోలేదు.

ఆ మాట చెప్పాను డాక్టరుకి.

అదోలా నవ్వాడు డాక్టరు

"ఓకే! మీకు టెన్షన్లు తగ్గించుకోవడం ఇష్టంలేనప్పుడు స్ట్రిక్టు డైటింగు చెయ్యక తప్పదు. పంచదార పూర్తిగా మానెయ్యాలి. ఉప్పు సగం తగ్గించేయాలి. నూనె వస్తువులు అసలు తినకూడదు. ఉడకపెట్టినవీ, పచ్చివీ కూరలెక్కువగా తినాలి. ఇవన్నీ మీరు చెయ్యకపోతే ఏదోరోజు మీకు గుండెపోటు వచ్చేస్తుంది!"

మర్నాటి నుంచి నురగలు కక్కే చిక్కని కాఫీ - దట్టంగా వెన్నరాసిన బ్రెడ్డూ నా దగ్గరికి రావడం మానేశాయి. నల్లటి డికాక్షన్ కాఫీ - ఉడకబెట్టిన కోడిగుడ్లూ, పొడి బ్రెడ్డు ముక్కలూ ఇవి నా ఉదయపు ఫలహారం.

"అమ్మయ్య, గుండెపోటు భయం తగ్గింది" అని సంతృప్తిగా నిట్టూర్చాను. ఆ సంతృప్తి అట్టేరోజులు నిలవలేదు. మరో రెండు నెలలకే మరో డాక్టరు దగ్గరికెళ్లాల్సి వచ్చింది.

ఈసారి కడుపులో విపరీతమైన నొప్పి, మంటా!

"కడుపులో అల్సరు - ఆపరేషన్ చేయ్యాలి" అన్నాడు డాక్టరు.

ఆస్పత్రిలో వారంరోజులు వృధా అయిపోయాయి.

"మీరు మసాలాలూ, కారాలూ ఎక్కువ తింటారా?" అడిగాడు డాక్టరు.

'అవు'నన్నాను. ఉప్పూ మానేసీ, తీపీ మానేసి ఇంకేం తిననూ? అందుకు ఈమధ్య కారాలు తినడం ఎక్కువ చేశాను.

"అంత ఎక్కువగా మసాలాలు తిన్నప్పుడు దానికి తగ్గట్టుగా నూనె తినాలి. పాలు తాగాలి" అన్నాడు డాక్టరు.

నేను హార్ట్ స్పెషలిస్టు దగ్గరికెళ్లిన విషయం, నా

## ఇక్కడా అంతే నందామా?

ఉడీ ఆలెన్ ఒక అమెరికన్ మేధావి, హాస్య రచయిత, చిత్ర దర్శకుడూను. ఆయన ఇటీవల ఇలా చెప్పాడు: "కేలిఫోర్నియాలో ఇప్పుడు చెంటపోగులను దూరంగా తీసుకెళ్లి పారవేయడం మానివేశారు. అందుకు బదులుగా వాటిని నవలలుగా, సినిమాలుగా, టీ. వీ. సీరియల్స్‌గా మార్చేస్తున్నారు!"

ఆలెన్‌గారు ఆంధ్రప్రదేశ్ వచ్చి ఉంటే 'టాయిలెట్ల' ప్రసక్తి తెచ్చి ఉండేవారేమో!



హై బ్లడ్ ప్రెషర్ విషయం చెప్పాను.

“మీరిలా మసాలాలు, కారాలు తింటే మళ్లీ అల్సరు రాక తప్పదు. అందువల్ల మీరు నూనెలు, పాలూ అయినా ఎక్కువగా తీసుకోవాలి. లేదా మసాలాలు, కారాలు, డికాక్షన్, కాఫీలు, మాంసం పూర్తిగా మానెయ్యాలి” అన్నాడు డాక్టరు.

“మసాలాలు మానేయకుండా ఉండాలంటే నూనెలు తినాలి. నూనెలు తింటే గుండెపోటు వస్తుంది. గుండెపోటు రాకుండా ఉండాలంటే కొన్ని వ్యాపారాలు వదులుకోవాలి! అమ్మో!

తీపీ, ఉప్పూ, నూనె ఎలాగూ వదిలేశాను. పులుపూ, కారం కూడా వదిలేస్తే పోలా?

“కారం, పులుపూ మానేస్తాను డాక్టర్” చెప్పేశాను.

నేనేమి తినొచ్చో, ఏమేమి తినకూడదో పెద్దలిస్టే చదివాడు డాక్టరు. పులుపులూ, కారాలూ, మాంసాలూ, కోడిగుడ్లూ, కాఫీలూ, టీలూ అన్నీ మానేయమన్నాడు.

వేడి వేడిగా ఏదైనా తాగాలనిపిస్తే ఏ రాగిమాల్టో, బార్లీ మాల్టో తాగమన్నాడు. చల్లగా ఏదైనా తాగాలనిపిస్తే, పల్చని మజ్జిగ తాగమన్నాడు.

మర్నాడు పొద్దున్నే అందమైన పెద్ద చైనాక్లే కప్పులో ఆవిర్లొస్తున్న రంగులేని ద్రవపదార్థమేదో తెచ్చిపెట్టాడు రామన్న.

నోట్లో పోసుకొంటే రుచీ పచీ ఏదీ లేదు.

“ఏమిటిది?” అడిగాను.

“బార్లీ మాల్ట్ సార్” వినయంగా అన్నాడు రామన్న. ఏ రోగమూ లేకపోతే ఇందులో కాసిని పాలు, పంచదార, ఉప్పో వేసుకు తాగొచ్చు. కాని డాక్టరొద్దన్నాడుగా?

మనసులో తిక్కరేగింది. “బుద్ధిలేని డాక్టరు ఏదో చెప్పాడు. వెళ్ళి ఇంత పంచదారో, ఉప్పో పట్టుకురా ఫో!” అని రామన్నను కసరబోయాను.

వెంటనే రక్తపుపోటు, గుండెపోటు, అల్సర్ అన్నీ గుర్తొచ్చేశాయి. వీటన్నిటితోబాటు చేతిలోంచి జారిపోయే వ్యాపారాలూ గుర్తొచ్చేశాయ్.

అయితే కిక్కురుమనకుండా కప్పులోని ద్రవాన్ని కాస్తకాస్త తాగుతూ కిటికీలోంచి కిందికి చూశాను.

చెట్టుకింద ముష్టివాడు పొయ్యిమించి బొచ్చెను దించి అందులో ఇంత ఉప్పేసుకొని ఆనందంగా తాగుతున్నాడు.

ఆ ముష్టాడు తాగేదీ నేను తాగేదీ ఒక్కటే..పేరు లోనే తేడా!

అది అంబలి...ఇది మాల్టు!

పైగా వాడు దాంట్లో ఉప్పుకూడా వేసుకొన్నాడు! అదృష్టవంతుడు!

ఆ ముష్టాడి మీద జాలి తగ్గిపోయి కోపం ముంచుకొచ్చింది.

“వచ్చిరొట్టెలో పాయసమ్మో ఏది తింటేనేమి గువ్వా!



**కథ అల్లడం**

“ఏరా రవీ! మీ అమ్మకు కథ లల్లడం వచ్చా? మా అమ్మయితే బోలెడన్ని అల్లుతుంది” అడిగాడు కిరణ్ రవిని.

“మా చెల్లికి జడ వేయడం కూడా రాదు. అలాంటిది మా అమ్మకు ఇంక కథ లల్లడం ఏమొస్తుంది?” బదులిచ్చాడు రవి.

భోశ్రీ [హైదరాబాదు]

వదును కోపము వదులుకొంటే వరమసివుడే నీవు గువ్వా!”

కాచుకొన్నదేదో తాగేసి హాయిగా తత్వాలు పాడు కొంటున్నాడు.

కోపం ఇంకా పెరిగిపోయింది!

“వెధవ!, డబ్బు తీసుకొన్నప్పుడు తలెత్తయినా చూడడు. ఇవాళ వీడి నేడిపించాలి!” అనుకొన్నాను.

రోజులా ఇరవై పైసలు కోకుండా వెతికి వెతికి ఓ పదిపైసల బిళ్ళ తీసి వాడివైపు విసిరేశాను. రోజూ ఇరవై పైసలు ఎలా తీసుకొంటాడో, ఇవాళ పది పైసలూ అలాగే తీసుకొన్నాడు. రోజులాగే “వరమసివుడే నీవుగువ్వా.. వరమసివుడే నీవు గువ్వా!” అనిపాడుకొంటూ చెట్టుకింది కెళ్ళిపోయాడు.

* * *

రెండు నెలల తర్వాత మళ్ళా డాక్టరు దగ్గరి కెళ్ళాల్సి వచ్చింది. ఈసారి ఆర్థోపెడిక్స్ డాక్టరు!

ఈ మధ్య విపరీతంగా మెడనొప్పి, వెన్నుపోటూ వస్తున్నాయి.

“స్పాండిలైటిస్” అన్నాడు డాక్టరు.

“మీరు రోజులో చాలా భాగం కుర్చీలో కూర్చోవ లసొస్తుందా?” అడిగాడు.

“అవును వ్యాపారం వ్యవహారాలు చూసు కుందుకు రోజుకి పది పన్నెండు గంటలు టేబిల్ ముందు కూర్చోవలసుంటుంది. ఆపైన మీటింగుల్లో రోజుకి నాలుగైదు గంటలు కూర్చోవల సుంటుంది. ఇకపోతే ఇటూ అటూ తిరగడానికి కార్లో రెండు మూడు గంటలు కూర్చోవలసి వస్తోంది.

“చూడండి- మీకీ వెన్నుపోటు తగ్గాలంటే రోజుకి నాలుగైదు గంటలు కుర్చీలోంచి దిగి నేలమీద కాళ్ళు ముడుచుకు కూర్చోడమో,వెల్లకిలా పడుక్కోవడమో చెయ్యాలి.” అన్నాడు డాక్టరు.

‘అమ్మో! రోజుకి నాలుగ్గంటలే! గంట ఖరీదు రెండువేలు! అంతడబ్బు నేను వెచ్చించలేను!

“ఆఫీసు వేళల్లో అంతసేపు కుర్చీదిగి గడపడం కుదరదు డాక్టర్! మరో మార్గంలేదా?”

“ఓ.కే పని వేళల్లో మీరు రిలాక్సేషన్‌కి అంతసైము వెచ్చించలేనప్పుడు నేను చెప్పినట్లు చేయక తప్పదు. భోజనం రోజూ డైనింగ్ టేబిల్ మీదగాక కింద నేలమీద కూర్చుని చెయ్యండి. రాత్రి పరుపు మీద కాక గట్టినేల మీద తలకిందేమీ పెట్టుకోకుండా పడుకోండి. ఇక పోతే ఆఫీసులో ఎలాగూ కుదరదు కాబట్టి, ఇంట్లో చేసుకొనే పనులన్నీ కుర్చీలోగాక కింద నేలమీద కూర్చొని చేసుకొండి. ఇవన్నీ గాక చెప్పబోయే ఎక్సెసర్‌సైజులు రోజుకు పావుగంట పాటు చెయ్యండి.”

అప్పట్నించి నాకు నేలమీదే భోజనం, నేలమీదే పడక!

ఆరోజు మధ్యాహ్నం మేడమీద గది తలుపు



కెదురుగా చిరుచాపమీద కూర్చొని, వెండిపళ్లెంలో పెట్టిన రెండు వుల్కాల్లోనూ వెజిటబుల్ సలాడ్ నంచుకొని చిరాగ్గా తింటుంటే, గేటవతల చెట్టు కింద ఎండురొట్టెలో పచ్చి ఉల్లిపాయ నంచుకు తింటూ ముష్టివాడు కనిపించాడు.

వుల్కాలు... ఎండురొట్టెలు...!

వెజిటబుల్ సలాడ్.... పచ్చి ఉల్లిపాయలు....!

కోపంగా పళ్లునూరుకొన్నాను. ఏదో తిన్నాననిపించి డన్‌లప్ పరుపు వేసిన పెద్ద డబుల్‌కాట్ మంచం పక్కనే, నేలమీద చాపమీద వెల్లికిలా పడుకొన్నాను చిన్న కునుకు తీద్దామని.

"పట్టుపరుపో గట్టినేలో ఏడవంటే నేమిగువ్వా!
ఉరుకు చింతల పరుగునాపిన పరమసివుడే నీవుగువ్వా!"

కిందనించి ముష్టివాడు పాడుకొంటున్న తత్వం వినిపించింది.

అంతకంతకూ స్వరం పెంచి పాడేస్తున్నాడు వాడు.

నిద్ర తేలిపోయింది. లేచి కిటికీలోంచి కిందకు చూశాను. నేను గదిలో ఇంతసేపూ ఎలా పడుక్కొన్నానో, వాడూ అచ్చు మట్టిలో అలాగే పడుక్కొన్నాడు.

నాకు తిక్కరేగింది.

ఏ రాజభవనంలోనో పడుక్కొన్నట్లు ఎంత దర్జాగా పడుక్కొన్నాడో వెధవ! వాడికి బుద్ధి చెప్పాలనిపించింది.

ఎప్పుడో బీరువాలో పడేసిన రెండు పైసల బిళ్లని వెలికితీసి వాడి ముందుకు విసిరేశాను.

వాడి కళ్లలో నిరాశ చూద్దామనుకొన్న నాకు నిరాశ మిగిలింది. ఇరవై పైసల బిళ్లలు ఎలా తీసుకొన్నాడో దీన్నీ అలాగే తీసుకొన్నాడు. పైగా ఎప్పటిలాగే "పరమసివుడే నీవు గువ్వా... పరమసివుడే నీవు గువ్వా" అని పాడుకొంటూ చెట్టుకిందికి వెళ్లిపోయాడు.

కాలు నేలకేసి కసిగా బాదాను.

*** *** ***

మరో నెలరోజులకే మళ్లా మరో డాక్టరు దగ్గరికెళ్లాల్సి వచ్చింది. స్కిన్ స్పెషలిస్టు! వారం రోజుల్నించి చర్మమంతా పొడిబారి ఒకటే దురదలు, మంటలు! ఈ దురదలతో రాత్రంతా నిద్రలేక, పగలు వ్యాపారం పనులమీద బొత్తిగా శ్రద్ధ కుదరడంలేదు!



## సంబంధం

"చంద్రుడికీ, మన దేశానికీ చాలా దగ్గర సంబంధముందోయ్!" అన్నాడు పాపారావు.

"అ దెలా?" అడిగాడు లక్ష్మీనారాయణ.

"నెలపొడుపు నుంచి పౌర్ణమి వరకు పెరిగే చంద్రుడిలా ధరలు పెరుగుతూ ఉన్నాయి. పౌర్ణమి నుంచి అమావాస్య వరకు తరిగే చంద్రుడిలా మన రూపాయ విలువ తగ్గుతూ ఉన్నవి. ప్చ్!" దిగులుగా చెప్పాడు పాపారావు.

నజీమా షహజాది [గుంటూరు]

"మీ శరీరంలో హఠాత్తుగా కొవ్వు పదార్థాలూ, విటమిన్ డి, విటమిన్ ఏ తగ్గిపోవడం వలన ఇలా అయింది. మీరీ మధ్య నూనెలు మానేశారా?"

అవునన్నాను. హార్టు స్పెషలిస్టు దగ్గరికీ జనరల్ సర్జను దగ్గరికీ వెళ్లిన విషయమూ, హై బ్లడ్ ప్రెషరూ, అల్సరు విషయమూ చెప్పాను.

"సో మీరు నూనెలు తినే అవకాశం లేదు! అందువల్ల మీరు చేయవలసిందల్లా నేనిచ్చే ఈ నూనెను ఒంటికంతకూ పట్టించి, వీలయినంత వరకు ఒంటిని ఎండకు ఎక్స్‌పోజ్ చెయ్యడమే! ఇకపోతే వీలయినంత వరకు చెట్ల మధ్య గడిపితే మంచిది. పగలంతా ఆరు బయట ఎలాగూ గడపలేరు కాబట్టి, రాత్రిపూట వీలయితే ఆరు బయట పడుక్కోండి."




రెండ్రోజుల్లోనే వీధిలోని వేపచెట్టు కింద మెరుస్తున్న సిమెంట్ గచ్చు తయారయింది. పొద్దున్న ఆఫీసుకెళ్లేదాకా.. సాయంత్రం ఆఫీసునించి వచ్చాకా మొలకో చిన్న తువ్వాలు చుట్టుకొని, డాక్టరిచ్చిన నూనె రాసుకొని, ఆరుబయటే గడుపుతున్నాను. ఇంట్లో చూసుకొనే బిజినెస్ వ్యవహారాలు వేపచెట్టు కింద సిమెంట్ గచ్చుమీద అలా అర్ధనగ్నంగా కూర్చొనే చూసుకొంటున్నాను. నా పడకా, భోజనం అన్నీ ఆ వేపచెట్టు కిందే!

మొట్ట మొదటి రోజు వేపచెట్టు కింద వెల్లికిలా పడుక్కొనేసరికి గేటవతల్నించి ముష్టివాడి గొంతు వినిపించింది.

"కోటలున్నా పేటలున్నా కొసకు పొట్టేకొలత గువ్వా!
వలని వానిని వదిలివేసిన పరమసివుడే నీవు గువ్వా!"

చల్లటి వేపచెట్టు గాలి ఒంటికి మెల్లగా తగులుతుంటే నాకూ వాడితోబాటు గొంతెత్తి హాయిగా పాడాలనిపించింది.

పాడుకో బోయేంతలోనే బుర్రలోకి ఒక ఆలోచనొచ్చింది. "అవునూ... నాకాసెట్ల బిజినెస్సులో ఇటువంటి తత్వాల కాసెట్లు కూడా ప్రవేశపెడితే ఎలా ఉంటుంది?" అని పాట మరిచిపోయాను. కాసెట్ల వ్యాపారం గురించి ఆలోచించసాగాను.

ఆ రోజు పొద్దున్నే ఏడు గంటలప్పుడు ఒంటికి చిన్న తుండగుడ్డ చుట్టుకొని, ఒంటినిండా డాక్టరిచ్చిన నూనె పట్టించుకొని, కాంపౌండులో వేపచెట్టు కింద ఎండ తగిలేలా కూర్చుని వ్యాపారాలకి సంబంధించిన కాగితాలు చూసుకొంటున్నాను. ఈ మధ్య వ్యాపార వ్యవహారాల్లో విపరీతంగా టెన్షన్ పెరిగిపోతోంది. హోటలు వ్యాపారంలో లాభాలు సగానికి సగం పడిపోయాయి. మేనేజరూ, ఎకౌంటెంటూ కలిసి లాలూచీపడి డబ్బు తినేస్తునారేమోనని అనుమానంగా ఉంది.

వీడియో కేసెట్ల వ్యాపారంలో హఠాత్తుగా డిమాండ్ పడిపోయింది. బట్టల వ్యాపారంలో బాగానే లాభాలొస్తున్నాయ్‌గానీ వ్యాపారం పెంచడానికి ఫండ్స్‌లేవు. ఇంకా ఎన్నెన్నో సమస్యలు...!

డాక్టరు సలహా మీద ఉప్పు, పంచదార, నూనె మానేయబట్టి గానీ, లేకపోతే ఈ సరికి గుండెపోటొచ్చి చచ్చి ఊగుకుండే వాడిని!

కొన్ని వ్యాపారాలు మూసేయాలి. కొన్ని పెంచాలి. కొన్నిటిని కలిపేయాలి.. కొన్నిటికి బ్యాంకు అప్పు తీసుకోవాలి. ఇవన్నీ ఇంకొకరితో చర్చించేవి కావు. నేనొక్కడినే ఏకాంతంలో ఆలోచించి తీసుకోవలసిన నిర్ణయాలు!

ఏదైనా ఒక పద్ధతిలో చెయ్యడం నాకలవాటు. అందుకే ముందుగా ఒక కాగితం తీసుకొని ఒకదానికిందొకటి ఒకటి నుంచి ఏడుదాక అంకెలు వేశాను. ఒకటో అంకె ఎదురుగా 'హోటల్ వ్యాపారం' అని రాశాను. రెండో అంకె కెదురుగా




"ఈ చీరల్లో ఏదో ఒకటి మీకు తప్పక నచ్చుతుంది." చెప్పాడు సేల్స్‌మెన్ రాణితో.
"అబ్బే. చూపించిన చీరలు-చాల్లేండి. మిగిలినవి మళ్లీ వచ్చినప్పుడు చూస్తాను" చెప్పింది రాణి.

షేక్ బాబ్జీ [మార్టేరు]

'క్యాసెట్ వ్యాపారం' అని రాశాను. మూడో అంకె కెదురుగా కలం పెట్టబోతుండగా చెవులు చిల్లులు పడేలా ఇంట్లోంచి టేప్‌రికార్డర్ శబ్దం విని పించింది.

"ఏక్ దో తీన్ చార్ పాంచ్ చే సాత్ ఆఠ్ నౌ దస్ గ్యారా బారా తేరా" అంటూ హిందీ పాట! చెవులు హోరెత్తిపోయాయి.

"ఏయ్ ఆ పాట కట్టేయండి!" అంటూ కోపంగా అరవబోయాను. నేను అరవనవసరం లేకుండానే టేప్‌రికార్డర్ ఆగిపోయింది.

"అమ్మయ్య" అని నిట్టూర్చి మూడో అంకె కెదురుగా 'బట్టల వ్యాపారం' అని రాశాను.

నాలుగో అంకె కెదురుగా పెన్ను పెట్టబో తుండగా టేప్‌రికార్డర్‌తో ఎదురుగా ప్రత్యక్షమ యింది నా భార్య.

"ఏమండీ, స్వామి సచ్చిదానంద ఉపన్యాస మండీ! నాకొక్క ముక్క అర్థమవడంలేదు. కొంచెం ఈ టేప్ విని అర్థం చెప్పరూ?" బతిమాలుతోంది నా భార్య.

"నీకీ స్వాములార్ల ఉపన్యాసాల మీద ఎప్ప ట్నుంచి శ్రద్ధ పుట్టింది?" ఆశ్చర్యంగా అడిగాను.

"శ్రద్ధా పాడా! ఈ ఊరి ఎమ్మెల్యే దగ్గర్నుంచి మా లయనెస్ క్లబ్బుకి పది వేలు గుంజుదామని చూస్తున్నాం. ఆయనకీ స్వాములారి ఉపన్యాలంటే మహా ఇష్టమట. ఈ టేపువిని ఏవో నాలుగు ముక్కలు ఆయనతో మాట్లాడితే ఫండ్సు శాంక్షన్ చేయించకపోతాడా అని నా ఆశ!"

"సరే టేపు పెట్టు" అన్నాను ఇక తప్పదని.

కాస్సేపట్లో టేపులోంచిఎవరో ఆ సచ్చిదానంద స్వామివారి మాటలు వినపడసాగాయి. ఏక్ దో తీన్ అని మీరందరూ హుషారుగా పాడేసుకొంటున్నా రు. కానీఈ ఒకటి రెండు మూడుల్లో ఉన్న తమాషా మీకు తెలుసా?

నే చెప్తా వినండి! పరబ్రహ్మం ఒక్కటే- ఆ ఒక్కటీ తెలుసుకోవాలంటేద్వంద్వాలను విడిచిపె ట్టి- త్రిగుణాలను అతిక్రమించి సాధన చతు ష్టయం ఆధారంతో పంచేంద్రియాలను అరికట్టి, అరిషడ్వర్గాలను జయించి, సప్త ధాతువులతో కూడిన ఈ దేహాన్ని మరచిపోవాలి.

ఇక ఈ ఒకటీ రెండు మూడుల అర్థాలు చెప్తావినండి. పరబ్రహ్మం ఒక్కటే అన్నాను కదా? పరబ్రహ్మం అంటే సచ్చిదానందం అంటే మీరనే 'ఎటర్నల్ బ్లిస్'. ద్వంద్వాలను విడిచిపెట్టడ మంటే 'మంచిచెడ్డలు', 'లాభనష్టాలు', 'కష్టసుఖా లు' విడిచిపెట్టి సమదృష్టితో ఉండడం! త్రిగుణా లంటే సత్వరజస్తమో గుణాలు. ఇక సాధన చతు ష్టయం అంటే నాలుగు విధాలయిన సాధనాలు అవేమిటంటే...."

"ఆపు"... గట్టిగా అరిచాను. "ఇక్కడ నేను నా ఒకటి రెండ్లతో సతమతమవుతూంటే మధ్యలో నీ స్వామివారి అంకెలు కూడానా? నా బుర్ర మరింత వేడెక్కించడానికి. నాకు ఆ ఉపన్యాసంలో ఒక్కము క్క అర్థంకాలేదు" కచ్చితంగా చెప్పేశాను.

ఉక్రోషంగా చూసింది నా భార్య.

"ఏమిటండీ అంత కొంపమునిగే ఆ వ్యాపారం లెక్కలు? ఎన్ని లెక్కలు వేసి ఎంత గడించినా చివరికి గోచీగుడ్డ కట్టుకొని గంజినీళ్లు తాగడమేగా?" ఈసడింపుగా అని లోపలికెళ్లిపోయింది.

తనక్కోపమొస్తే ఎంత మాటయినా అనేస్తుంది!

నాకు విపరీతమైన చిరాకేసింది. చిరాగ్గానే కాగితాల్ని చేతిలోకి తీసుకొని నాలుగు అన్న అంకెకెదురుగా పెన్ను పెట్టబోయాను.

గేటు బయట చెట్టుకింద నించి ముష్టివాడి పాట వినిపించింది.

"ఒకటి తెలియగ రెండు విడిచీ మూడు దాటుమురా జీవా -
మూడు దాటుమురా!
మూడుదాటీ నాల్గునేర్చి అయిదు కట్టుమురా జీవా - అయిదు
కట్టుమురా!
అయిదు కట్టీ ఆరుచంపి - ఏడు మరువుమురా జీవా - ఏడు
మరువుమురా!
ఏడు మరిచీ గూటిలోపల దూరి కులుకుమురా జీవా - దూరి
కులుకుమురా!"

ఇందాకటి స్వామివారి ఉపన్యాసానికీ, దీనికీ ఎక్కడో పోలికున్నట్లనిపించింది. అదేలా బుర్రకెక్కలేదో, ఇదీ అంతే!

కాగితాల్ని అలాగే చేత్తో పట్టుకొని గేటు దగ్గరికొచ్చాను. చెట్టుకింద కళ్లు మూసుకొని కూర్చొని తన్మయత్వంగా పాడుకొంటున్నాడు వాడు.

మధ్య అడ్డంగా ఉన్న గేటు తప్పితే వాడికీ,నాకూ ఏమిటి తేడా? ఏమీ లేదు! పగలల్లా వాడు ఇంటింటికీ తిరిగి బిచ్చమెత్తుకొంటాడు. నేను నా వ్యాపారాల్లో తిరిగి డబ్బు సంపాదిస్తాను.

నేను 'మాల్టు' తాగుతున్నాను. వాడు అంబలి తాగుతున్నాడు.

నేను పుల్కాలూ,సలాడూ తింటున్నాను. వాడు ఎండు రొట్టెలూ, పచ్చి ఉల్లిపాయలూ తింటున్నాడు.

నేనూ ఉత్తనేలమీదే పడుక్కొంటున్నాను - వాడూ అంతే!

నేనూ, వాడూ కూడా ఒక్కలాగే మొలకో గుడ్డకట్టుకొని ఆరుబయట పడుక్కొంటున్నాం.

నా బిజినెస్ అవతారం చాలించాక నేనూ, వాడూ ఒకటే.

ఆ ఊహతో నా మనసులో తిక్కరేగిపోయింది!

వాడంటే జాలి ఎప్పుడోపోయింది. డబ్బులెయ్యడం ఎప్పుడో మానేశాను. ఇన్నాళ్లూ ఉక్రోషమే ఉండేది. ఇప్పుడు కసి కూడా పెరిగిపోయింది.

అంతే! హఠాత్తుగా నా బీపీ పెరిగిపోయింది. కోపం ఉవ్వెత్తునలేచింది.

"ఏయ్ పాట ఆపు!" అంటూ గట్టిగా అరిచాను.

వాడు చప్పున పాట ఆపేశాడు.

"నా ఇంటిముందున్న చెట్టుకింద నిన్నెవరుండమన్నారు?... ఫో.. గెటౌట్!" గొంతు చించుకొని అరిచాను.

నేను డబ్బులు వేస్తున్నప్పుడు ఎంత నిర్వికారంగా అవి తీసికొని వెనక్కి తిరిగేవాడో నేను పొమ్మన్నప్పుడు కూడా అంతే నిర్వికారంగా, తన సామాన్లు తీసుకొని వెనక్కు తిరిగాడు.

అతను వీధిమలుపుల్లో మాయమయ్యేదాకా అలా చూస్తుండిపోయాను.

"ఏడు మరిచీ గూటి లోపల దూరి కులుకుమురా జీవా.. దూరి కులుకుమురా.. దూరి కులుకుమురా... దూరి కులుకుమురా..."

అతను వీధిమలుపు తిరిగాక కూడా చాలాసేపు ఆ పాట వినిపించి... వినిపించి.. ఆఖరికి వినిపించడం మానేసింది.

నా కసి తీరిపోయింది!

చేతిలో నలిగిన కాగితాన్ని సరిచేసుకొంటూ గేటు దగ్గర్నుంచి వెనక్కు తిరగబోతుండగా అప్పుడు గుర్తొచ్చిందా విషయం!

వాడికీ, నాకూ తేడా లేదనుకున్నాను. కానీ తేడా ఎందుకు లేదూ?

ఓ స్పష్టమైన తేడా ఉంది!

వాడు ఏం తింటున్నా ఎక్కడ పడుక్కొన్నా ఎప్పుడూ హాయిగా పాడుకొంటూనే ఉన్నాడు!

నేను మాత్రం ఒక్క క్షణమైనా వాడిలా హాయిగా పాడుకోలేదు!

ఆ ఊహతో మళ్లీ బీపీ పెరిగిపోయింది.

కాని గొంతు చించుకునరవడానికి అక్కడ ముష్టివాడు లేడుగా? ●